శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

నగరాభివృద్ధికి సమగ్రమైన బడ్జెట్ ను రూపొందించండి కమిషనర్ సూర్య తేజ

నెల్లూరు కార్పొరేషన్,ఫిబ్రవరి 27,ప్రభాతవార్త: నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజనుల్లో అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించేలా సమగ్రమైన నూతన బడ్జెట్ ను రూపొందించాలని కమిషనర్ సూర్య తేజ అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ అన్ని విభాగాల ఉన్నతాధికారులతో బడ్జెట్ రూపకల్పన సమావేశాన్ని కార్యాలయంలోని కమిషనర్ చాంబర్లో గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను నగరపాలక సంస్థకు బడ్జెట్ కేటాయింపులో భాగంగా అన్ని విభాగాల అధికారులను సమన్వయం చేసుకొని, వారి సలహాలు, సూచనలు తీసుకొని అందరికీ ఆమోదయోగ్యమైన బడ్జెట్ ను రూపొందించాలని సూచించారు. నగర వ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పనకు నూతన బడ్జెట్ లో ప్రాధాన్యత కల్పించాలని, సంక్షేమంతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధిని చూపేందుకు ప్రణాళికాబద్ధంగా బడ్జెట్ ను పొందుపరచాలని సూచించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు,యస్. ఈ.రామమోహనరావు,డీ.సీ.పీ.పద్మజ, మేనేజర్ ఇనాయతుల్లా, అకౌంటెంట్ పద్మజ, అన్ని విభాగాల ఉన్నతాధికారులు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

సర్వేలకు ప్రజలు సహకరించి సరైన వివరాలు తెలపండి అదనపు కమిషనర్ వై.ఓ నందన్

నెల్లూరు కార్పొరేషన్,ఫిబ్రవరి 27,ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో వార్డు సచివాలయ కార్యదర్శుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ రకాల సర్వేలకు ప్రజలంతా సహకరించి సరైన వివరాలను తెలియజేయాలని అదనపు కమిషనర్ వై ఓ నందన్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజల ఆర్థిక ప్రగతికి, మరింత మెరుగైన సంక్షేమాన్ని అందించేందుకు రూపొందించిన ఎం.ఎస్.ఎం.ఈ సర్వే, పి4 సర్వే, ఆధార్ నమోదు చేసుకొని చిన్నారుల సర్వే, వర్క్ ఫ్రం హోం సర్వేల నిర్వహణలో గడపగడపకు వార్డు సచివాలయ కార్యదర్శులు సందర్శించి ప్రజలను వివరాలు అడుగుతారని, వారికి సరైన వివరాలను అందించి, సర్వేను విజయవంతంగా పూర్తి చేసేందుకు తోడ్పడాలని అదనపు కమిషనర్ ఆకాంక్షించారు.

రెడ్ బుక్ రాజ్యాంగంతో కూటమి ప్రభుత్వ కక్ష సాధింపులు

కోవూరు ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : నిస్వార్థంగా ఎటువంటి పదవులు ఆశించకుండా కేవలం దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి మీద , జగన్‌మోహన్‌రెడ్డి మీద ఉన్న అభిమానంతో పార్టీకి తోడుగా ఉన్న పోసాని కృష్ణమురళిని అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. అటువంటి మంచి వ్యక్తిని ఈ కూటమి ప్రబుత్వం అరెస్టు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులు పతాక స్థాయికి చేరుకున్నాయని, ఇది ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అన్నారు.

చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి : పోలింగ్ విధానాన్ని పరిశీలించిన నేతలు

కోవూరు ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో గురువారం మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు ఓటు వేశారు. ఈ నేపత్యంలో ఆయనతో కలిసి ఆంధ్రప్రదేశ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న పోలింగ్ విధానాన్ని పరిశీలించారు.

అల్లూరులో శివపార్వతుల కళ్యాణం

అల్లూరు,ఫిబ్రవరి 27,ప్రభాతవార్త : అల్లూరుపేటలో వెలిసియున్న శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా గురువారం శివపార్వతుల కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు ఆలయ ప్రధాన అర్చకులు ముప్పిరాల అనిల్ స్వామి శివపార్వతులను ప్రత్యేక పూలతో అలంకరించి మంగళ వాయిద్యాలు నడుమ భక్తిశ్రద్ధలతో శాస్త్రోహంగా శివపార్వతుల కళ్యాణాన్ని నిర్వహించారు ఉదయకర్తలు భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.అనంతరం స్వామివారు అల్లూరుపేట పురవీధుల్లో భక్తులకు దర్శనం ఇవ్వగా భక్తులు స్వామి వారిని కనులారా దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు.

అంధుడికి చూపును ప్రసాదించిన సంయుక్త సేవాసంస్థ

కావలి, ఫిబ్రవరి27 ప్రభాతవార్త కావలి సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో విడవలూరు మండలం పురిణి గ్రామానికి చెందిన అంధుడు పాటూరు ధనుంజయకు చూపును ప్రసాదించారు. సంయుక్త సేవాసంస్థ జీవనజ్యోతి విభాగంద్వారా సంస్థ సభ్యులు నేలపాటి వెంకటరమేష్, శాంతివర్ధన్, ఒట్టూరు శ్రీనివాసులు, నల్లపరెడ్డసాయిసౌమ్యరెడ్డి, లంకపల్లి శ్రీనివాసరావు, వాకాటి మహేంద్ర, శ్రీదేవి దంపతులు, గంధం ప్రసన్నాంజనేయులు, ఎంవియన్ ప్రసాదరావు, అంజాద్‌ఆలీల సహకారంతో నెల్లూరు శ్రీషిరిడిసాయి రూరల్‌వెల్‌ఫేర్, మెడికల్ ఫౌండేషన్‌లో కంటిఆపరేషన్ చేయించి చూపును ప్రసాదించారు. ఈ సందర్భంగా గురువారం సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అద్యక్షులు గంగపట్నం సురేంద్ర మాట్లాడారు. అంధుడు ధనుంజయకు 12 సంవత్సరాలక్రితం రెండుకళ్లు కనిపించకుండాపోయాయన్నారు. ఆపరేషన్ చేయించుకునే స్థోమతలేక ఇబ్బందులు పడుతున్నారన్న విషయం తెలుసుకుని తన సంస్థసభ్యుల ఆర్థికసహాయంతో ధనుంజయకు ఆపరేషన్‌చేయించి చూపుకల్పించామన్నారు. ఈ సందర్భంగా దాతలకు ధనుంజయ ధన్యవాదాలు తెలిపారు.

హనుమంత సేవలో కోదండరామస్వామిగా శ్రీదేవి భూదేవి సమేతుడైన కళ్యాణ వెంకటేశ్వరస్వామి

బుచ్చి ఫిబ్రవరి 27 ప్రభాతవార్త బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీ ఏరియాలోని రామకృష్ణ నగర్‌లో వెలిసటువంటి శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద బ్రహ్మోత్సవాల్లో భాగంగా హనుమంత వాహనంపైన కోదండరామస్వామి వారుగా శ్రీదేవి,భూదేవి సమేతుడైన కళ్యాణ వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు.భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్ద ప్రసాదాలు స్వీకరించారు.

సోమశిల నీటిమట్టం

అనంతసాగరం, ఫిబ్రవరి27 ,ప్రభాత వార్త: మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం సాయంత్రానికి 408 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో59.574టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 350, ఎన్ఎఫ్‌సికి 0, పెన్నా డెల్టాకు 2480, కండలేరు వరద కాలువకు200 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 97.948మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

గురుకులంలో బాలలపై వెట్టిచాకిరిపై మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలి

జిల్లా యంత్రాగాన్ని కోరిన రాష్ట్ర బాలల హక్కుల కమీషన్

ఉదయగిరి, ఫిబ్రవరి 27, ప్రభావార్త జిల్లాలో ఉన్నటువంటి ఉదయగిరి మండల పరిధిలోని గండిపాలెం గురుకుల పాఠశాలకు సంబంధించి ప్రిన్సిపాల్ పుష్పరాజ్ కొంత మంది పిల్లలచే వంట పనులు చేయిస్తున్నారని కొన్ని పత్రికల్లో వార్తలు రావడం తో విద్యార్థులతో పనులు చేయిస్తున్న వీడియోలు కూడా వైరల్ అవుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు కూడా తమకు ఫిర్యాదు చేశారని దీనిపై రాష్ట్ర బాలల హక్కుల కమీషన్ స్పందించింది. పిల్లలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరమని, గురుకుల పాఠశాలల్లో ఉన్నటువంటి సిబ్బంది అక్కడ నీటి వసతి, క్లీనింగ్‌తో పాటు అన్ని పనులు చూసుకోవాలని పిల్లలతో పనులు చేయించడం తగదని గురుకుల పాఠశాలల్లో కానీ కస్తూర్బా స్కూల్స్, మోడల్ స్కూల్స్, సోషల్ వెల్ఫేర్ ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ హాస్టల్స్‌లో ఉన్నటువంటి పిల్లలతో పని చేయించడంచట్టరీత్యా నేరమని బాలల న్యాయ చట్టం 2015 నకు ఇది విఘాతం కలిగిస్తుందని పిల్లలు చదువుకునేందుకే వసతి గృహాలకు వస్తారని, ప్రభుత్వం పిల్లల కోసం అన్ని సదుపాయాలు ఏర్పాటు చూస్తుందని, నెల్లూరు జిల్లాలోపిల్లలతో వెట్టి చాకిరి అని సోషల్‌మీడియాలో కొన్ని కథనాలు చూసి రాష్ట్ర బాలల హక్కుల కమీషన్ స్పందించిందని, కమీషన్ సభ్యులు బత్తుల పద్మావతి తెలిపారు. పిల్లలచే వెట్టి చాకిరి చేయించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆరోపణలువచ్చిన రెసిడెన్షియల్ స్కూల్‌కు సంబంధించిన జిల్లాల బాలల సంక్షేమ కమిటీ జిల్లా బాలల సంరక్షణ విభాగం యంత్రాంగం ఎంక్వెయిరి వెళ్లారని, మూడు రోజుల్లో మాకు నివేదిక సమర్పించాల్సిందిగా గురువారం జిల్లా అధికారులను అలానే జిల్లా కలెక్టర్‌ని కూడా బాలల హక్కుల కమీషన్ చైర్ పర్సన్ అప్పారావు, సభ్యురాలు బి.పద్మ కోరడం జరిగింది.

ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచండి-విద్యార్థులకు స్టేషనరీ అందించిన మేయర్

నెల్లూరు కార్పొరేషన్,ఫిబ్రవరి 27,ప్రభాతవార్త: మార్చి నెల 1వ తేదీ నుంచి 17వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలలో నెల్లూరు నగరపాలక సంస్థ మున్సిపల్ జూనియర్ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచాలని మేయర్ స్రవంతి జయవర్ధన్ ఆకాంక్షించారు. కార్పొరేషన్ కార్యాలయం మేయర్ చాంబర్లో నగరపాలక సంస్థ మున్సిపల్ జూనియర్ కళాశాలల విద్యార్థులు 284 మందికి పరీక్షలకు అవసరమైన స్టేషనరీ సామాగ్రిని మేయర్ గురువారం పంపిణీ చేసారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఏలాంటి ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలను విజయవంతంగా ముగించాలని సూచించారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా మున్సిపల్ కళాశాలల విద్యార్థులు పరీక్షలలో ఉత్తమ ఫలితాలను సాధించి నెల్లూరు నగరపాలక సంస్థకు మంచి పేరు తీసుకురావాలని మేయర్ ఆకాంక్షించారు

యాప్ ద్వరా పింఛన్ల పంపిణీ నమోదు : డిఆర్డిఏ పీడీ నాగరాజు కుమారి

నెల్లూరు (కలెక్టరేట్), ఫిబ్రవరి 27, ప్రభాతవార్త జిల్లాలో మార్చి ఒకటన జరిగే ఫిబ్రవరి నెలకి సంబంధించిన సామాజిక పింఛన్ల పంపిణీ పారదర్శకంగా అవినీతికి తావు లేకుండా జరగాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డి ఆర్ డి ఏ) ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజు కుమారి సూచించారు. గురువారం కలెక్టరేట్ ఆవరణంలోని డిఆర్డిఏ కార్యాలయం నుండి మండల అధికారులు డిఆర్డిఏ సిబ్బందితో ఆమె సామాజిక పింఛన్ల పంపిణీపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 3,07,232 మంది లబ్ధిదారులకు 28 రకాల సామాజిక పింఛన్లను ప్రతినెలా అందజేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా వారికి రూ. 132 కోట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్న ఆమె మార్చి 1న జరిగే ఈ ప్రక్రియ పారదర్శకంగా జరగాలన్నారు. పింఛన్‌దారుల సౌలభ్యం కోసం పింఛన్ల పంపిణీ ఉదయం 6 గంటలకు బదులుగా ఏడు గంటలకు మొదలు పెట్టాలన్న ఆమె ఇందుకు సంబంధించిన నగదును 28వ తేదీ బ్యాంకుల నుండి తీసుకోవాలన్నారు. పింఛన్ల పంపిణీ లబ్ధిదారులకు గౌరవంగా సంతృప్తికరంగా జరపాలన్న డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ నిర్దేశించిన యాప్ లో పింఛన్ల పంపిణీ నమోదు చేయాలన్నారు.

మాది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం

పేదల కళ్లల్లో ఆనందం చూడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

కోవూరు ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : : బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని పేదల కళ్లల్లో ఆనందం చూడడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మాగుంట లేఅవుట్‌లోని వీపీఆర్ నివాసంలో గురువారం కోవూరు నియోజకవర్గ పరిధిలోని ప్రధానమంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన పథకం కింద ఎంపికైన 16 మంది ఎస్సీ సోదరీమణులకు 35 లక్షలు విలువ చేసే చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజికంగా వెనుకబడ్డ ఎస్సీ సోదరీమణులను ఆర్థికంగా ఆదుకునేందుకు కేంద్రంలోని కూటమి ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టిందన్నారు. బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ సంక్షేమ అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకు సాగుతున్నారన్నారు. తమది మాట ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వం అని ఆచరణలో నిరూపిస్తున్నారని ఈ సందర్భంగా ఆమె కొనియాడారు. స్వయం ఉపాధి కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని మహిళలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజకుమారి, పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ రాజగోపాలరెడ్డి, టీడీపీ నేతలు ఇంతా మల్లారెడ్డి, బత్తుల హరికృష్ణ, ఎంవీ శేషయ్య, రావెళ్ల వీరేంద్ర, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, అడపాల శ్రీధర్‌రెడ్డి, నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలలకు సంబంధించిన వెలుగు ఏపీఎంలు, సీసీలు ఉన్నారు.

మనుబోలు హైస్కూల్ పరిశీలించిన డిఇఒ

మనుబోలు ఫిబ్రవరి 27 ప్రభాతవార్త మనుబోలు లోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలని ఆకస్మిక తనిఖీ నిర్వహించిన డిఈవో బాలాజిరావు రికార్డులని పరిశీలించి విద్యార్థిని విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం విద్యాశాఖ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మార్చి 17 నుండి జరగబోవు 10 వ తరగతి పరీక్షల గురించి తీసుకున్న జాగ్రత్తల గురించి తెలియజేశారు. జిల్లాలో ఎటువంటి అవకతవకలు లేకుండా మంచి వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు తగు చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ ఆద్వర్యంలో లైన్ డిపార్ట్మెంట్ సమావేశం నిర్వహించడం జరిగిందని తద్వారా అన్ని ప్రభుత్వ శాఖలకు సూచనలు ఇచ్చామని తెలియజేశారు. ఏపిఎస్ఆర్టీసి వారిని పదోతరగతి పరీక్షలు జరుగుతున్న సమయంలో విద్యార్థులు హాల్ టికెట్ చూపిస్తు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించవలసిందిగా కోరడమైనదని అలాగే విద్యుత్ శాఖ వారిని కూడా పరీక్ష సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని కోరుతామని ఆరోగ్యశాఖ నుండి ఒక అధికారిని పరీక్షా సమయంలో విదులలో ఉంచడమే కాకుండా అత్యవసర మందులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని అలాగే పోలీస్ అధికారులతో కూడా చర్చించామని పరీక్షల సమయంలో పరీక్షలు జరుగు ప్రదేశాల చుట్టుపక్కల జెరాక్స్ సెంటర్లు లేకుండా చూడాలని కోరడమైనదని తెలియజేశారు. అంతే కాకుండా ఈ సంవత్సరం సిట్టింగ్స్ స్క్వాడ్ కూడా ఏర్పాటు చేయడం జరిగిందని ఒక పురుషుడు,ఒక స్త్రీ అధికారులు పరీక్ష ప్రదేశాలలో ఉంటారని తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఎంఇఒ ఏవి రమేష్‌బాబు, సిబ్బంది,జోగి ఆదిశేషయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయవిజ్ఞానం పెంపొందించడమే జెవివి లక్ష్యం : డాక్టర్ బెజవాడ రవికుమార్



కావలి, ఫిబ్రవరి27 ప్రభాతవార్త విద్యార్థుల్లో శాస్త్రీయవిజ్ఞానాన్ని పెంపొందించడమే జనవిజ్ఞానవేదిక లక్ష్యమని జెవివి గౌరవఅద్యక్షులు, పలుసంఘాల బాధ్యులు డాక్టర్ బెజవాడ రవికుమార్ తెలిపారు. కావలి రెడ్‌క్రాస్ భవనంలో గురువారం జెవివి ఆధ్వర్యంలో వైజ్ఞానిక ప్రదర్శనలపోటీ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ బెజవాడ మాట్లాడారు. ఫిబ్రవరి 28వ తేది దేశవ్యాప్తంగా జాతీయ సైన్సు దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు. అందులోభాగంగా ఈ నెల 21వ తేదీనుంచి 26వ తేదీవరకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, సందేశాత్మకపాటలు, వ్యక్తిగత, బృందనృత్యపోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ రోజు వైజ్ఞానిక ప్రదర్శనపోటీ నిర్వహించారన్నారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాలకు ఈ పోటీలు నిర్వహించారన్నారు. చీనాబ్‌బ్రిడ్జి, సోలార్‌కారు, చంద్రయాన్-3, ఫోటోసింథసిస్, కిరణజన్యసంయోగక్రియ, సేవ్‌ఎర్త్ సేవ్‌లైఫ్ వంటి అంశాలపై 26 పాఠశాలలనుండి 32 ప్రదర్శనలు పోటీలో ప్రదర్శించారన్నారు. కావలి పట్టణంలోని డాక్టర్ టి.రమ్య, డాక్టర్ జి.మాలిని, డాక్టర్ ఇ.వెంకటేష్, డాక్టర్ ఎంవి.లక్ష్మినారాయణమ్మ, డాక్టర్ అనూషారెడ్డిలు ఈ ప్రదర్శనలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారన్నారు. ఈ నెల 28వ తేది మధ్యాహ్నం 3 గంటలకు జాతీయ సైన్సు దినోత్సవం విచిత్రవేషధారణపోటీతో ప్రారంభమవుతుందని జెవివి అద్యక్షులు తోట వెంకటేశ్వర్లు తెలిపారు. విజేతలకు బహుమతుల ప్రధానం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి ప్రధానకార్యదర్శి గాదిరెడ్డి హరనాధ్, కోశాధికారి టి.సుబ్బరామశర్మ, రెడ్‌క్రాస్ ఛైర్మన్ దాకారపు రవిప్రకాష్, వైస్‌ఛైర్మన్ బి.హరినారపరెడ్డి, జాయింట్ కార్యదర్శి చాకలికొండ శారద, ఎస్‌కె.ఖాదర్‌బాష, ఎంవియన్ ప్రసాదరావు, సి.కల్లయ్య, కందికట్టు నారాయణ, కె.జాన్, తదితర సభ్యులు పాల్గొన్నారు.

ఉచితంగా పరీక్ష సామాగ్రి పంపిణీ

నెల్లూరు, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త-వైద్యం నవాబుపేట చిన్న బాలయ్య నగర్లోని హైస్కూల్లో తడికల బజారు సెంటర్లోని ఆర్ఎస్ఆర్ హైస్కూల్లో చదువుతున్న 190మంది పదో తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు గురువారం ఉదయం ది నెల్లూరు డిస్ట్రిక్ట్ డైరక్ట్ బాక్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరీక్ష సమాగ్రిని గురువారం ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంగా ప్రాజెక్టు చైర్మన్ చార్టెడ్ అకౌంటెంట్ జేవీ చలపతిరావు ప్రసంగిస్తూ.. సృజన సంస్థ అధ్యఓఉలు దగ్గుపాటి రాధాకృష్ణ అభ్యర్థన మేరకు, తమ అసోసియేషన్ ద్వారా రూ.30వేల విలువైన పరీక్ష సామాగ్రిని వితరణ చేశామన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు చార్టెట్ అకౌంటెంటెట్ వీఎంవీ సుబ్బారావు, సెక్రటరీ విజయకుమార్, ట్రెజరర్ ఏ.లీలా మోహన్, పూర్వ అధ్యక్షులు శేషయ్య, కొణిజేటి శ్రీనివాసులు, సంఘ సేవలకులు పెనాక సుజాతరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థలకు మార్గ నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు జాస్మిన్, పి.నాగేశ్వరమ్మ, టి.లక్ష్మీ నారాయణ, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని దగ్గుబాటి రాధాకృష్ణ పర్యవేక్షించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నెల్లూరు, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త-వైద్యం రూడ్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీహరి పుష్కర్ భారత్ గ్యాస్ వారి సహకారంతో గురువారం బుజబుజ నెల్లూరులోని డీవీఎన్ ఎం జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సాక్ష్యం కార్యక్రమంలో భాగంగా క్లీన్ ఎన్విరాన్మెంట్ త్రూ గ్రీన్ అండ్ క్లీన్ ఎనర్జీ అనే కార్యక్రమాన్ని నిర్వహించి తొమ్మిదో తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగింది. గెలుపొందిన వారికి మొదటి మూడు బహుమతులు, ప్రోత్సాహక మూడు బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి పీహెచ్పీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడానికి అందరూ బాధ్యత వహించాలని, పరిశుభ్రమైన ఇంధనం యొక్క ఆవశ్యకత గురించి, ప్రజల ఆ ఇంధనాన్ని వాడే విధానం గురించి అవగాహన కల్పించే ఉద్దేశంతో భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఆయిల్ కంపెనీలతో భాగస్వామ్యమై నిర్వహించేటువంటి సాక్ష్యం కార్యక్రమంలో భాగంగా ఈ రోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో అభినందనీయమని, ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు పరిశుభ్రమైన ఇంధన వాడకం గురించి తెలుసుకునే విధంగా విద్యార్థులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడిందని అన్నారు. వారు భవిష్యత్ తరాలతో ప్రకృతిపై తమకు ఉన్నటువంటి మక్కువని చాటుకుని పర్యావరణ ప్రేమికులుగా మారి పర్యావరణాన్ని కాపాడుకునే ఉద్దేశంతో వారి చేత ప్రతిజ్ఞ చేయించడం కూడా జరిగిందని ఆయన అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు గ్రామ గ్రామాన జరిగి ప్రజల పర్యావరణ సమతుల్యత వైపు పయనించేలా భారత ప్రభుత్వం తీసుకుంటున్నటువంటి ఈ కార్యక్రమం ఎంతో గొప్పదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రూడ్స్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ షేక్ రసూల్, శ్రీహరి పుష్కర్ భారత్ గ్యాస్ ప్రపోప్రైటర్ ఎం.సునీత లక్ష్మీ, కే.రాంబాబు, పాఠశాల హెచ్ఎం మల్లిఖార్జునరావు, ఉపాధ్యాయులు అచ్యుత మణి, పీహెచ్పీ కోశాధికారి దేవరకొండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ శివపార్వతుల గ్రాముత్సోహం

కలిగిరి, పిబ్రవరి 27, ప్రభాతవార్త; కలిగిరిలోని శ్రీ పర్వత వర్ధినీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్తానములో మహాశివరాత్రి సందర్భంగా గురువారం స్వామి అమ్మవార్ల గ్రామ ఉత్సోహం కనుల పండుగగా జరిగింది. మహాశివరాత్రి సందర్భంగా కలిగిరిలోని శివాలయంలో రెండురోజులపాటు శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొదటిరోజు స్వామి అమ్మవార్ల అలంకరణ, ప్రత్యేక పూజలు, అబిక్షేకాలు ,కుంకుమ పూజలు జరిగాయి. బుదవారం రాత్రికి శ్రీ శివపార్వతుల కల్యాణం చూపరులకు నేత్రపర్వంగా జరుగగా గ్రామస్తులు, బక్తులు ఈకార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొని స్వామి అమ్మవార్లవార్ల కల్యాణాన్ని కనులారా తిలకించారు. అనంతరం గురువారం స్వామి అమ్మవార్లు గ్రాముత్సోహం జరుగగా ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. మగళవాయిద్యాలు, డప్పులు, కరతాళద్వనులతో బాణాసంచా చిరు దివ్వెలనడుమ గ్రామ ఉత్సవం కోలాహలంగా జరిగింది. మద్యాహ్నం స్వామి వారి సన్నిదిలో పెద్దఎత్తున అన్నదానకార్యక్రమం నిర్వహించారు.

ప్రీ స్కూల్ కార్యక్రమాలు పాదర్శకంగా నిర్వహించాలి

కోవూరు ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : : అంగన్వాడీ కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్న చిన్నారులకు ప్రీ స్కూల్ కార్యక్రమాలను పారదర్శకంగా నిర్వహించేలా అంగన్వాడీ కార్యకర్తలు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ రాధిక అన్నారు. కోవూరులోని పెళ్లకూరు కాలనీ ప్రాంతంలో గురువారం కోవూరు సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రానికి వచ్చే ప్రతి చిన్నారి ఎత్తు, బరువులను ఖచ్చితంగా తూచి ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం ద్వారా వచ్చిన పౌష్టికాహారాన్ని గర్భవతులకు, బాలింతలకు క్రమం తప్పకుండా పంపిణీ చేసి పౌష్టికాహారంపై వారిలో మరింత అవగాహన పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో కోవూరు సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు ఉన్నారు.

డాక్టరేట్ పొందిన పాస్టర్స్కి సన్మానం చేసిన సంఘ పెద్దలు, సంఘస్తులు

ఉలవపాడు, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త గౌరవ డాక్టరేట్ పొందిన ముగ్గురు పాస్టర్స్కి స్థానిక ఉలవపాడు మండలంలోని భారత బాప్టిస్టు చర్చిలో స్థానిక సంఘ కాపరి రెవ డాక్టర్ కోలాగిరి రమేష్, పాస్టర్ రెవ డాక్టర్ పాలపర్తి రమేంద్రబాబు, రెవ డాక్టర్ ఆలూరి కాలేబు, పాస్టర్స్కి ఫిబ్రవరి 3వ తేదీన, ఏబీఎఫ్ఎంఎస్ మిషన్ వారు డాక్టరేట్ ఇచ్చిన సందర్భంగా నేడు స్థానిక భారత్ బాప్టిస్టు చర్చి నందు సంఘ పెద్దలు సమక్షంలో సంఘస్తులు, ఈ ముగ్గురు పాస్టర్స్కి శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉలవపాడు మండల పాస్టర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులందరూ పాల్గొన్నారు. అలాగే స్థానిక సంఘ పెద్దలు, పున్నేపల్లి శ్రీనివాసులు, రాయపాటి జాలారావు, రాయపాటి భాస్కరరావు, మరికొంత మంది పెద్దలు పాల్గొన్నారు.

పథకాలు రైతులకు చేరాలి

కోవూరు ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : కోవూరులోని శాంతినగర్లో ఉన్న పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో గురువారం కోవూరు పశు సంవర్ధక శాఖ సబ్ డివిజన్ పరిధిలోని రెండు మండలాలకు సంబంధించిన పశు వైద్యులు, పశు సహాయకులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ కృష్ణమౌర్య మాట్లాడుతూ మార్చి 1వ తేది నుంచి 30వ తేది వరకు కోవూరు పశు సంవర్ధక శాఖ సబ్ డివిజన్ పరిధిలోని రెండు మండలాల్లో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతుందని, దీనికి పాడి రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా పశు సంవర్ధక శాఖ ద్వారా ప్రభుత్వం అందించే పథకాలు పాడి రైతులకు అందించేలా పశు సహాయకులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రస్తుతం కోవూరు పశు సంవర్ధక శాఖ సబ్ డివిజన్ పరిధిలోని రెండు మండలాల్లో అఖిల భారత పశు గణన 95 శాతం పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన 5 శాతం కూడా సకాలంలో చేపట్టేలా సర్వే బృందం చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు డాక్టర్ వాణి శంకర్, డాక్టర్ షబానా, డాక్టర్ ప్రీతి సాల్మన్, లైవ్ స్టాక్ అసిస్టెంట్ సజ్జాద్ అహ్మద్, పశు సహాయకులు ఉన్నారు.

కొనసాగుతున్న వికలాంగుల పరీక్షలు

కోవూరు ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇందుకూరుపేట మండలానికి సంబంధించిన వికలాంగుల పింఛన్ల పరిశీలన కార్యక్రమం కొనసాగుతుంది. ఈ పరీక్షలో వైద్యులు ప్రత్యేకంగా చొరవ తీసుకుని పారదర్శకంగా ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలకు లోబడి కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఇందుకూరుపేట మండలానికి సంబంధించి ఈ కార్యక్రమం కొనసాగుతోంది.

మార్చి 3 లోగా ఈ పంట నమోదు చేసుకోవాలి

కోవూరు ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ పంట నమోదు చేసుకోని రైతులు మార్చి 3వ తేది లోగా ఈ పంట నమోదును చేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత అన్నారు. కోవూరులోని రైతు సేవా కేంద్రంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కేవైసీ వలన ప్రభుత్వ పథకాలైన పంటల భీమా, ప్రకృతి వైపరీత్యాల వలన నష్టాలు అన్నింటికీ అర్హత ఉంటుందన్నారు. ముఖ్యంగా వ్యవసాయం సాగు చేసే ప్రతి రైతు యునిక్ ఐడీ నెంబర్ను గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుతం వరి కోతలు దగ్గర పడుతున్న నేపథ్యంలో కోతలు పూర్తయిన తర్వాత పశువుల ఎరువును పొలంలో కుప్పలు కుప్పలుగా పోస్తే అందులో ఉండే పోషకాలు ఎండల వేడిమికి 48 గంటల్లో ఆవిరి అయిపోతాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని దుక్కి దున్నే సమయంలోనే ఎరువులను తోలుకోవాలన్నారు. మండలంలోని 14 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి మాట్లాడుతూ మట్టి పరీక్షల పలితాల్లో చాలా మంది రైతుల పొలాల్లో భాస్వరం పరిమితి కన్నా ఎక్కువ నిల్వలు ఉన్నాయని, ఇవి నేలకు చాలా ప్రమదమన్నారు. దీని వలన నేల చౌడు భారి ఇతర పోషకాలు అందుబాటులో ఉండవన్నారు. పురుగుమందులు కూడా వెంట వెంటనే పిచికారి చేసే పద్ధతికి స్వస్తి చెప్పాలన్నారు. వారం నుంచి 10 రోజుల వ్యవధిలో అవసరమైతే మాత్రమే పురుగు మందులు పిచికారి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు మెహర్నిసా, చైతన్య, రాజశేఖర్, తదితరులు ఉన్నారు.

నేడు సైన్స్ దినోత్సవ వేడుకలు

కోవూరు ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కార్యాలయంలో గురువారం పచ్చిపాల రామనాథమ్మ ఎడ్యుకేషనల్ అకాడమి కార్యదర్శి పచ్చిపాల మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిని ఝాన్సీ రాణి మాట్లాడుతూ ఈ నెల 28న శుక్రవారం సైన్స్ డే కార్యక్రమం సందర్భంగా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను మరింత వెలికి తీసి వారిని ప్రోత్సహించేందుకు రామనాథమ్మ ఎడ్యుకేషనల్ అకాడమి ముందుకు వచ్చిందని, ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ. 50 వేలు ప్రథమ బహుమతి కింద.. మరో ఆరుగురికి ఒక్కొక్కరకి రూ. 15 వేలు చొప్పున ప్రత్యేక పారితోషకాలు ఇచ్చేందుకు అకాడమి ముందుకు వచ్చిందన్నారు. అదేవిధంగా ఎస్ఏ రైటింగ్లో ప్రతిభ కనబరిచిన ఐదు మంది విద్యార్థులకు ప్రత్యేక నగదు ప్రోత్సహకాలు కూడా అందజేయడం జరుగుతుందన్నారు. ఇందుకు పచ్చిపాల రామనాథమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, కార్యదర్శి మల్లికార్జునరెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ దేవిక, గీతామాధురిలు ఉన్నారు.

శరవేగంగా కొనసాగుతున్న పెట్రోల్ బంక్ పనులు

కోవూరు ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో పడుగుపాడు షహకార సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న పెట్రోల్ బంక్ పనులను గురువారం సొసైటీ సీఈవో గోవర్ధన్రెడ్డి నిశితంగా పరిశీలించారు. చేపట్టే పనుల్లో తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలు ఉండాలన్నారు. సాధ్యమైనంత త్వరలో చేపట్టే పనులు పూర్తి చేసేలా సంబంధిత కాంట్రాక్టర్ చొరవ తీసుకోవాలన్నారు. ఈ పరిశీలనలో ఆయన వెంట సొసైటీ ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు.

టైలర్స్డేను జయప్రదం చేయాలి : కావలి టైలర్స్ అసోసియేషన్ నేతలు

కావలి, ఫిబ్రవరి27 ప్రభాతవార్త టైలర్స్డేను పురస్కరించుకుని కావలి టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్డేను ఘనంగా నిర్వహిస్తున్నామని, టైలర్స్ అందరూ తరలివచ్చి జయప్రదం చేయాలని ఈ అసోసియేషన్ నేతలు తెలిపారు. కావలి పట్టణ రైల్వేరోడ్డు జర్నలిస్ట్క్లబ్లో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కావలి టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.రమేష్, కార్యదర్శి షేక్.రహమాన్, ట్రెజరర్ పి.వేణు, సలహాదారులు షేక్.రఫీలు మాట్లాడారు. కావలి టైలర్స్ అసోసియేషన్ ఏర్పడి 32 సంవత్సరాలు అయిందన్నారు. ఈ సందర్భంగా వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు కావలి ఆర్టిసి బస్టాండ్ నుండి ర్యాలీగా బయలుదేరి అయిదులాందర్ల సెంటర్లోని ఎవియస్ కళ్యాణమండపంవరకు చేరుతుందన్నారు. అక్కడ టైలర్స్డే సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్రావు, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్కుమార్రెడ్డి, జనసేనపార్టి కావలి నియోజకవర్గ ఇన్చార్జి అళహరి సుధాకర్లు పాల్గొంటారన్నారు. అలాగే ఉన్నతాధికారులు ఆర్డిఒ వంశికృష్ణ, డిఎస్పి శ్రీధర్, మున్సిపల్ కమీషనర్ శ్రావణ్కుమార్లు పాల్గొంటారన్నారు. టైలర్స్ వృత్తిలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ప్రభుత్వం టైలర్స్ సబ్సిడి రుణాన్ని అందచేసి ఆదుకోవాలన్నారు. ప్రభుత్వస్కూల్స్కు ఇచ్చే యూనిఫారమ్లను రెడిమేడ్ కంపెనీస్కు ఇవ్వకుండా మాలాంటి టైలర్స్కు ఇస్తే జీవనోపాధిని కల్పించినట్లు అవుతుందన్నారు. టైలర్వృత్తిలో ఉండేవారందరూకూడా పేదవారేనన్నారు. టైలర్స్ అందరికి ఇళ్లస్థలాలిచ్చి టైలర్స్కాలని ఏర్పాటుచేయాలన్నారు. టైలర్స్ అసోసియేషన్కు కమ్యూనిటి భవనాన్ని ఏర్పాటుచేయాలని కోరారు. టైలర్స్ వృత్తిలో చిన్నవయసులోనే మోకాళ్లనొప్పులు, కంటివ్యాధులు వస్తున్నాయని అందుచేత 45యేళ్లకే పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ అసోసియేషన్ సభ్యులు అల్తాఫ్, రెహమాన్, రసూల్, జమీర్, లక్ష్మయ్య, బద్రినాథ్, సిరాజ్, శీను, గోపి, తదితరులు పాల్గొన్నారు.

కావలి ఏరియా వైద్యశాలలో పేదలకందని వైద్యం

తెలుగుదేశంపార్టినేత గుండ్లపల్లి

కావలి, ఫిబ్రవరి27 ప్రభాతవార్త కావలి ఏరియావైద్యశాలలో పేదలకు వైద్యం అందడంలేదని పర్యవేక్షించాల్సిన కమిటి సభ్యులు చోద్యంచూస్తున్నారని తెలుగుదేశంపార్టి నాయకుడు, జిల్లా తెలుగు యువత మాజీ అర్గనైజింగ్ కార్యదర్శి గుండ్లపల్లి మురళియాదవ్ తెలిపారు. కావలి పట్టణ రైల్వేరోడ్డులోని జర్నలిస్ట్క్లబ్లో గురువారం ఆయన మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలని ఒకవైపు రాష్ట్రప్రభుత్వం మరోవైపు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అహర్నిశలు పాటుపడుతున్నారన్నారు. వైద్యులు పేదలకు అందుబాటులోఉంటూ మెరుగైన వైద్యం అందించాలని పలుమార్లు ఏరియావైద్యశాలలో సమావేశాలు నిర్వహించి ఎమ్మెల్యే ఆదేశించడం జరిగిందన్నారు. అయినా, పేదలకు వైద్యం అందడంలేదన్నారు. ఈ నెల 26వ తేది తనకు ఆరోగ్యం బాగోలేక అత్యవసరంగా కావలి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాల్సి వచ్చిందన్నారు. అక్కడ సెక్యూరిటి సిబ్బంది తనపట్ల దురుసుగా ప్రవర్తించి వివాదానికి దిగారన్నారు. దీంతో తనకు బి.పి 200ల వరకు పెరిగిందన్నారు. బాగోలేక వైద్యశాలకు వెళితే అభివృద్ధి కమిటిసభ్యులుకూడా చూస్తూ ఉన్నారేకాని, సెక్యూరిటిని మందలించలేదన్నారు. అలాగే డాక్టర్లుకూడా తూతూ మంత్రంగానే వైద్యం అందిస్తున్నారన్నారు. అత్యవసరంగా బాగోలేక వెళ్లినా ట్యాబ్లెట్లు ఇచ్చేందుకుకూడా ఇక్కడకు వెళ్లండి... అక్కడకు వెళ్లండి... అంటూ తిప్పుతున్నారన్నారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి కావలి పట్టణాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్నారన్నారు. అయితే, ఆయన ఆశయాలకు తగ్గట్టుగా ప్రభుత్వవైద్యశాలలో కమిటిసభ్యులు నడుచుకోవడంలేదని మురళియాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వైద్యశాలలో తనకు జరిగిన అవమానాన్ని, అందని వైద్యం గురించి ఫిర్యాదుచేసేందుకు కంప్లెయింట్బుక్ ఇవ్వమంటే ఇచ్చేదిలేదని, దిక్కున్నచోట చెప్పుకోమని సిబ్బంది వాదనకుదిగారన్నారు. చదువుకున్న మాలాంటివారికే ఇలా జరుగుతుంటే పేదల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. కావలి ఏరియా వైద్యశాలలో జరుగుతున్న విషయాలను ఎమ్మెల్యే దగుమాటి దృష్టికి తీసుకువెళతానన్నారు. ఇప్పటికైనా వైద్యశాలకు వచ్చే పేదలపట్ల వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేసి మెరుగైన వైద్యం అందించి ఎమ్మెల్యే దగుమాటికి మంచిపేరు తేవాలని మురళియాదవ్ కోరారు.

సర్వాయపాలెంలో అక్రమమద్యం విక్రయాలపై దాడులు

కావలి, ఫిబ్రవరి27 ప్రభాతవార్త కావలిరూరల్ మండలం సర్వాయపాలెం గ్రామంలో చట్టవిరుద్ధంగా మద్యం విక్రయాలు నిర్వహిస్తున్నవారిపై కావలి ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు గురువారం ఆకస్మికదాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని సూరగాని వెంకటరావును అదుపులోకి తీసుకున్నారు. కావలి ఈ శాఖ ఎస్ఐ దేవిక, సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు.

దారి స్థలం అక్రమించారంటు ఫిర్యాదు

కలువాయి ఫిబ్రవరి 27 ప్రభాతవార్త మండలకేంద్రమైన కలువాయి అరుంధీయవాడలోని ఆంజనేయస్వామి గుడి వీధి నందు దారి మార్గాన్ని ఆక్రమించారంటు గురువారం ఆ ప్రాంతప్రజలు తహసిల్దారు శ్యామ్ సుందర్ రాజుకు అదే విధంగా మండల పరిషత్ కార్యాలయం, పంచాయితీ కార్యాలయం నందు అధికారులకు ఫిర్యాదు చేశారు. మా వీధి నందు 30 కుటుంబాలకు సంబందించిన రోడ్డు మార్గాన్ని కాలి బాట వేశారని ఫిర్యాదులో పేర్కున్నారు. ఆప్రాంతంలో ఉండే వినియోగంలోలోని మంచినీటి బావిని ఆసరా చేసుకొని 2 వైపుల ధారి స్థలాన్ని అక్కడి వారు ఆక్రమించడంతోపాటు మంజూరైన సిమెంట్ రోడ్డును సైతం పనులను నిలిపి వేయడం జరిగిందని వారు తెలిపారు. అత్య వసర సమయంలో ఏ వాహనం వచ్చేందుకు కూడా దారి లేకపోవడంతో అప్రాంత వాసులు నానా ఇబ్బందులు పడుతున్నామని అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని బాధితులు వినతి పత్రంలో విన్నవించుకున్నారు.

అగ్నిబాధితులను పరామర్శించి ఆర్థికసహాయం చేసిన ఎమ్మెల్యే

కావలి, ఫిబ్రవరి27 ప్రభాతవార్త కావలి పట్టణం రైల్వేస్టేషన్ సమీపంలో విద్యుత్ ఘాతానికి గురై గుంజి వెంకటేశ్వర్లుకు చెందిన పూరిల్లు అగ్నికి ఆహుతైంది. సర్వ స్వం కోల్పోయి కుటుంబ సభ్యులు రోడ్డు నపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి టిడిపినేతలతో హుటా హుటిన సంఘటన ప్రదేశానికి వెళ్లారు. అగ్నిబాధితులు గుంజి వెంకటేశ్వర్లు దంపతు లను పరామర్శించారు. ఆర్థికసహాయం అందచేసి అండగాఉంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ పూరింట్లో లక్షాయాభైవేల నగదు, పదిహేను సవర్ల బంగారు నగలు, వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయని బాధితులు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. ఎమ్మెల్యే వెంట టిడిపి పట్టణ అద్యక్షుడు గుత్తికొండ కిషోర్బాబు, టిడిపి లీగల్సెల్ కావలి నియోజవకవర్గ కన్వీనర్ గుంటుపల్లి రాజ్కుమార్చౌదరి, టిడిపినేత గాదంశెట్టి వేణుగోపాల్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లయకారకుడు, భోళాశంకరుడు, లార్డ్ శివపరమాత్మ :కావలి ఎమ్మెల్యే

కావలి, ఫిబ్రవరి27 ప్రభాతవార్త లయకారకుడు, భోళాశంకరుడు, కోరిన కోర్కెలు తీర్చే మహాశివుడిని ప్రతి ఒక్కరూ పూజించి, ధ్యానించాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. కావలి పట్టణం వడ్డిపాలెంలో ప్రజాపిత ఈశ్వరీయ బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయంలో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో కావలి ఎమ్మెల్యే దగుమాటి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహాపర్వదినం మహాశివరాత్రి అని ఆయన లింగ రూపంలో ఉద్భవించినరోజు అన్నారు. లింగోద్భవాన్ని దర్శించుకుంటే మంచి శక్తివస్తుందన్నారు. ఆ శివుడు అందరిలో ఉన్నాడన్నారు. అంతాశివమయమేనన్నారు. మహాశివరాత్రి విశిష్టతను, శివపరమాత్మ మహిమాన్విత తత్వాన్ని తనదైన శైలిలో అందరికి తెలియచేసి ఎమ్మెల్యే ఆకట్టుకున్నారు. అక్కడ ఏర్పాటుచేసిన ద్వాదశ జ్యోతిర్లింగాలను ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఈ అవకాశం కల్పించిన బ్రహ్మకుమారీలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యేకు వారు ఘనస్వాగతంపలికి మెమోంటోలను అందచేశారు. ఆయన వెంట టిడిపి నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షప్యాడ్లు బహుకరణ

కావలి, ఫిబ్రవరి27 ప్రభాతవార్త కావలి వెంగళరావునగర్ శ్రీపొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నతపాఠశాలలో శ్రీచైతన్య కళాశాల సౌజన్యంతో 10వ తరగతి చదువుతున్న 60 మంది విద్యార్థులకు పరీక్షలురాసే ప్యాడ్లు, పెన్నులు, తదితర కిట్లు గురువారం అందచేశారు. ఈ పాఠశాలలో ఉపాధ్యాయులు కూర్చునేందుకు నాలుగు కుర్చీలు బహుకరించారు. 10 వేలరూపాయల విలువైనవి పాఠశాల విద్యార్థులకు అందచేసినట్లు శ్రీచైతన్య కళాశాల బాధ్యులు మ్యాథ్స్ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సయ్యద్ హయ్యూల్ హయ్యూమ్, నూతన ప్రధానోపాధ్యాయులు వి.వెంకటేశ్వర్లు, ఎన్సిసి ఆఫీసర్ టి.కొండారెడ్డి, సీనియర్ జీవశాస్త్ర బోధకులు కెఎస్.అంజాద్ఆలీ, సీనియర్ ఉపాధ్యాయులు బి.శాంతకుమారి, బి.శర్వాణి, షేక్.సాబిరాబేగం, శ్రీలక్ష్మి, విజయలక్ష్మి, రజని, షేక్.రఫి, తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థుల గృహాలు సందర్శన

ఉదయగిరి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త ఉదయగిరి మండల పరిధిలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల బిజ్జంప

వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర ఉపసంచాలకులు శ్రీనివాసరెడ్డి

– పుట్టిన బిడ్డకు ఆధార్ నమోదు చేయాలి

నెల్లూరు, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త : బిడ్డ పుట్టిన వెంటనే శిశు ఆదార్ నమోదు చేయించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఉపసంచాలకులు ఎం.శ్రీనివాసరెడ్డి జిల్లా వైద్య శాఖ అధికారులకు సూచించారు. విజయవాడ నుంచి వచ్చిన ఆయన గురువారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాతో పాటు ఇతర అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిశు ఆధార్‌తో పాటు జనన దృవీకరణ పత్రాలను సకాలంలో పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జనన దృవీకరణ వివరాలను తక్షణమే ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఆరోగ్య సంక్షేమ కార్యక్రమాలైన టీకాలు వేయడం, ఫీవర్ సర్వే, ఎన్సీడీ, మలేరియా, కుష్టు, టీబీ లాంటి సర్వేలు– జ్యుల నియంత్రణకు చేపట్టి ప్రోగ్రెస్లో 100 శాతం ప్రగతి సాధించేందుకు కృషి చేయాలని కోరారు. ప్రజల నుంచి వచ్చిన గ్రీవెన్స్‌కు సంబంధించి పబ్లిక్ గ్రీవెన్స్ సెల్ సిస్టంలోఎలాంటి పెండింగ్ లేకుండా కృషి చేయాలన్నారు. అనంతరం స్థానిక దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన శిశు ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఏ కార్యాలయంలో ఏపీ మెడికల్ అండ్ హెల్త్ స్టాటిస్టికల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డెమో అధికారి కనకరత్నం, స్టాటిస్టికల్ ఆఫీసర్ సహన, డిప్యూటీ ఎం. మల్లిఖార్జున, టీపీహెచ్ఎన్ మంజుల, డీసీకు రమేష్, ఓఎస్‌లు రమేష్, మణికంఠ, జీపీని ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

రేపటినుండి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు

నెల్లూరు ఫిబ్రవరి 27, ప్రభాతవార్త విద్య : రేపటినుండి (మార్చి 1వ తేదీ) జిల్లాలోని 79 కేంద్రాల్లో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు జరుగనున్నాయని ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి డాక్టర్ ఆదురూ శ్రీనివాసులు పేర్కొన్నారు.. గురువారం స్థానిక ఆర్ఐఓ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ కేంద్రాల్లో కనీస వసతులను సమకూర్చుకొని విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాలకు అవసరమైన సౌకర్యాలు, సిబ్బందిని కళాశాల యాజమాన్యాలు సమకుర్చాలని, బోర్డ్ నిబంధనల ప్రకారం పబ్లిక్ పరీక్షలు నిర్వహించాలని, నియమాలను ఉల్లంఘించిన వారిపై 1997 ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ పరీక్షల నిబంధనల చట్టం ప్రకారం కఠిన చర్యలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. జంబ్లింగ్ విధానంలో ఉదయం 9 నుండి 12 గంటల వరకు నిర్వహించనున్న ఈ పరీక్షలకు 28,176 మంది (26931 జనరల్ మరియు 1245 వొకేషనల్) మొదటి సంవత్సరం విద్యార్థులు, 25,024 మంది (23994 జనరల్ మరియు 1030 వొకేషనల్)రెండవ సంవత్సరం విద్యార్థులు, మొత్తం 53,200 మంది విద్యార్థులు హాజరు కానున్నారని,మార్చి 1 నుండి 20వ తేదీ వరకు జరగనున్న ఈ పరీక్షల నిర్వహణ కోసం సుమారు 1400 మంది సిబ్బందిని నియమించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని తెలియజేసారు.పరీక్షా కేంద్రంలోని అన్ని గదుల్లో సిసి కెమెరాలు ఏర్పాటుచేసి సి సి కెమెరాలను ఇంటర్ బోర్డు ప్రధాన కార్యాలయానికి, శిఏవీ కార్యాలయానికి అనుసంధానించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎదురైనా సమస్యల పరిషరాంకోసం హెల్ప్ లైన్ నెంబర్ 08612320312 ఏర్పాటుచేయడం జరిగిందన్నారు.పరీక్షా కేంద్రాల పరిసరాల్లో144 సెక్షన్ అమలు, జిరాక్స్ షాపులు మూసివేత ను కఠినంగా అమలుచేయనున్నమ్మన్నారు.పరీక్షల నిర్వహణను పరిశీలించిదుకు 4 ఫ్లైయింగ్ ,5 సిట్టింగ్ స్క్వాడ్ల ఏర్పాటు చేశామని,సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. హాల్ టికెట్ల లో మీడియం, ద్వితీయ భాష వంటి ఏవైనా పొరపాట్లు ఉన్నా, విద్యార్థి ధ్రువీకరణతో పరీక్షకు అనుమతి ంచాలన్నారు.నిమిషం ఆలస్యం నిబంధన వర్తించదు పరీక్షా సమయం (9గంటలు) దాటిన తర్వాత, సహేతుక కారణాలతో కేంద్రానికి చేరుకునే విద్యార్థులను చీఫ్ సూపరింటెండెంట్ పరిశీలించి 2 నుండి 5 నిమిషాల ఆలస్యం వరకు పరీక్షా కేంద్రంలోనికి అనుమతించాలని తెలిపారు.. విద్యార్థులు అందరూ ఈ పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు దీన దయాళ్, వేణుగోపాల్, కొండయ్య, ఆర్ ఐ ఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాకర్లను కలిసిన టిడిపినేత ఖాజామస్తాన్

కలిగిరి, ఫిబ్రవరి27 ప్రభాతవార్త : ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్‌ను వింజమూరులోని ఆయన కార్యాలయంలో గురువారం కలిగిరి మండలం ఎరుకుల రెడ్డిపాలెం తెలుగు దేశంపార్టి నాయకులు, బిల్డర్ షేక్. ఖాజామస్తాన్, వింజమూరు మండలం లెక్కలవారిపాలెం టిడిపి నేత మాధవ మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా షేక్.ఖాజామస్తాన్ మాట్లాడారు. త్వరలో ఉదయగిరి నియోజకవర్గంలోని కలిగిరిమండలం ఎరుకులరెడ్డిపాలెం గ్రామంనందు శ్రీ ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు, పార్కు ఏర్పాటు, వాటర్‌ప్లాంట్ ఏర్పాటు, గ్రామంలోని రెండు పేదకుటుంబాలకు ఇళ్లనిర్మించే కార్యక్రమం, ఆరోగ్యంసరిగాలేని ఇద్దరికి వైద్యసహాయం, విద్యకునోచుకోని ఇద్దరు దివ్యాంగుల పిల్లలకు చదువుకునే సహాయం, పాఠశాలకు వరండా ఏర్పాటు, వింజమూరు మండలం లెక్కలవారిపాలెం గ్రామంనందు ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాట్లకు సంబంధించిన పలు శంకుస్థాపనలకు, ప్రారంభోత్సవాలకు, ఇతర కార్యక్రమాలు ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్‌ను కలిసి ఆహ్వానించడం జరిగిందని తెలియచేశారు. దీనికి వెంటనే ఎమ్మెల్యే కాకర్ల సురేష్ స్పందించి మీరు గ్రామానికి చేస్తున్న సేవ మరువలేనిదని మిమ్మల్ని ఆదర్శంగా ప్రతిఒక్కరూ తీసుకుంటే గ్రామాలు ఎంతో బాగుపడుతాయని తెలియచేశారన్నారు. త్వరలో తేదీలను ఖరారు చేస్తానని ఆ తేదీల ప్రకారం కార్యక్రమాలు జరుపుకోవాలని తెలియచేశారు.

వాస్తవాలు తెలుసుకోండి బురద చల్లొద్దు

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త : ఆనం ఆనంద్ ఫ్యామిలీలో ఎక్కడైనా భూకబ్జా చూశారా ఎన్నడైనా జరిగిందా అని వైఎస్ఆర్సిపి రూరల్ ఇంచార్జ్ ఆనం విజయ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. గురువారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్రం రాకముందు తన తల్లిదండ్రులు ఇచ్చిన స్థలాన్ని నలుగురు అన్నదమ్ములు పంచు కున్నామని ఆ స్థలాన్ని కబ్జా చేస్తున్నట్టు పలు వార్తా పేపర్లలో కథనాలు రావడం తో కలిసిందని అన్నారు. ఈనెల ఆనం రాజకీయ ప్రస్థానంలో ఏనాడైనా స్థలాలు కబ్జా చేయడం జరిగిందా అని ఆయన ప్రశ్నించారు. కబ్జా చేస్తున్నామని చెబుతున్న స్థలం మద్రాస్ కేంద్రంగా ఉన్న రోజునుండే ఆ స్థలంలో రైస్ మిల్ ఉందని అప్పటినుండే పన్నులు కడుతున్నామని తెలిపారు. మా తల్లిదండ్రుల కాలంలోనే ఉన్న ఆస్తులని పూర్తిగా అరగదీసుకుంటూ వస్తున్నమన్నారు, మేము సంపాదించింది ఏమీ లేదని ఆనం విజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. రూరల్ లో పార్టీ ఆఫీస్ కడుతున్నాం అన్న దుష్ప్రచారని ఆయన పట్టు పడేసారు నేను కావాలనుకుంటే ఆనంద్ సెంటర్లో ఉన్న ఆఫీస్ లో కూర్చునే చక్రం చెప్పగలరని తెలిపారు. నాకు ఆఫీస్ అవసరం లేదని నేను ఎక్కడుంటే అక్కడే నా ఆఫీస్ అని తెలిపారు. ఎవరినైనా రమ్మని చెప్పండి అది కబ్జా అని నిరూపిస్తే దేనికైనా సిద్ధమని ఆయన తెలిపారు. ఆనకుటము ఎన్నడు కబ్జాలు చేయడం దౌర్జన్యాలు చేయడం రాదన్నారు. ఏ పార్టీలో ఉన్న ప్రజలకు మంచి చేయడం సేవ చేయడమే వారి లక్ష్యమని తెలిపారు.

ఇంప్రూమెంట్ నిధుల చెక్కు అందజేత

ఉదయగిరి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త : ఉదయగిరి మండల పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాల వెంకట్రావుపల్లి అదనపు తరగతి గదుల నిర్మాణం కొరకు జిల్లా ఉన్నతా ధికారుల ఆదేశాల మేరకు టీఈఓ ద్వారా సమకూర్చిన రూ.2,00,000 స్కూల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్ నిధుల చెక్కులను శుక్రవారం ప్రధానో పాధ్యాయులు ఎం. బలరామయ్యకి ఇస్తున్న ఉదయగిరి మండల విద్యా శాఖాధికారులు షేక్ మస్తాన్‌వలి, తోట శ్రీనివాసులు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ చెక్కు ద్వారా త్వరగా పనులు పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులు బలరామయ్యకు సూచనలు సలహాలు ఇచ్చారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు క్రైమ్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త: నగరంలోని రామలింగాపురం రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండడానికి స్థానిక గుర్తించి పోలీసులకు సమాచారం. మృతుడికి సుమారు 60 ఏళ్ల వయసు ఉంటుందని, అతని వద్ద ఉన్న సంచిలో తాపీ పని సామాన్లు ఉండడాన్ని గుర్తించిన పోలీసులు మృతుడు బేల్దారి పనులు చేసే వ్యక్తి అయి ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఉదయగిరి గ్రామ పంచాయతీ నందు వేలంపాటు

ఉదయగిరి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త : మండల కేంద్రమైన ఉదయగిరి గ్రామ పంచాయతీ నందు శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు ఆత్మకూరు డివిజనల్ పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో వేలంపాట జరుగును. సదరు వేలంపాట నందు గ్రామ పంచాయతీలో ఖండమైపోయినటువంటి చెత్త సేకరించి ఆటోలు, రిక్షాలను వేలంపాట వేయబడును. ఆసక్తి గల వారు సదరు వేలంపాట నందు పాల్గొని వేలం పాట పాడుకోగలరని ఈవో కరిముల్లా తెలిపారు.

జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షునిగా రవీంద్రబాబు

– అడ్వైజర్ కమిటీ చైర్మన్‌గా ఉప్పల్ లక్ష్మణ్

– నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక

– జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షునిగా ఏ.రవీంద్రబాబు(రవితేజ) ఎన్నికయ్యారు.

నెల్లూరు ఫిబ్రవరి 27, ప్రభాతవార్త : అడ్వైజర్ కమిటీ చైర్మన్‌గా ఉప్పల్ లక్ష్మణ్ వైస్ చైర్మన్‌లాగా బీఎస్ఎస్ శశిజీఎస్ రాజు సభ్యులుగా కేశవ రమేష్ పి.వెంకటేశ్వరరావు, జనరల్ సెక్రటరీగా ఆర్‌వీ సూర్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులుగా వి.సత్యనారాయణ(విజయవాడ), ఏ.సత్య నారాయణ (విజయనగరం), కే.రామచంద్రారెడ్డి(అనంతపురం), కార్యదర్శులుగా ఎన్.లక్ష్మీపతి(చిత్తూరు) వీ.కృష్ణ(విశాఖపట్నం), సునీల్ కుమార్(కర్నూలు), ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా భూసా నాగేశ్వరరావు (నరసరావుపేట), జి.శివకు మార్(విజయవాడ), టి.రామాంజనేయులు(గుంటూరు), కార్యవర్గ సభ్యులుగా ఎం.ఎల్లారెడ్డి, కే.లలితకుమారి ఈ కంద స్వామి జేవీయర్ గోపాల్ వర్మ, కే.మురళీకృష్ణ, ఏ.శ్రీనివాసులు, ఎస్. లక్ష్మణరావు, ఈ.బాలచంద్ర, బొమ్మిశెట్టి మోహన్, బి.సుధీర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం అన్ని జిల్లా కమిటీలతో జూమ్ సమావేశాన్ని నిర్వహించగా అన్ని జిల్లాల కమిటీలుగా రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అడ్వైజర్ కమిటీ చైర్మన్ ఉప్పల్ లక్ష్మణ్ మాట్లాడుతూ 32 సంవత్సరాలుగా జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ జర్నలిస్టు సమస్యలపై ప్రభుత్వాలకు ప్రజాప్రతినిధులకు తెలియజేస్తూ పరిష్కారం చేసిన ఘనత జాప్‌కు దక్కుతుందన్నారు. ఈ నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రబాబు మాట్లాడుతూ రానున్న కాలంలో రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికి అక్రిడిటేషన్ మంజూరుకు కృషి చేస్తామన్నారు. జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి అందరికి ఆమోదం యోగ్యమైన విధంగా ఇళ్ల మంజూరుకు హెల్త్ రాయితీలు విద్యాసంస్థల్లో రాయితీలు కల్పించే విధంగా కృషి చేస్తామన్నారు.

రోడ్ల మరమ్మతు పనులను వేగవంతం చేయండి-కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు కార్పొరేషన్,ఫిబ్రవరి 27,ప్రభాతవార్త: నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో అన్ని డివిజన్లో చేపడుతున్న రోడ్ల మరమ్మతు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ సూర్య తేజ అధికారులను ఆదేశించారు. పారిశుద్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 23వ డివిజన్ పోలేరమ్మ చెట్టు సెంటర్, బ్యాంకు కాలనీ, అనగుంట ప్రాంతాలలో కమిషనర్ గురువారం పర్యటించారు. డివిజన్ పరిధిలో వివిధ ప్రాంతాలలో రోడ్లపై గుంతలు గుర్తించిన కమిషనర్ వెంటనే సరి చేయవలసిందిగా ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రోడ్డుపై ఉన్న భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించేందుకు సంబంధిత భవన యజమానులకు నోటీసులు జారీ చేయాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు. రోడ్డుపై ఉన్న ఉపయోగంలో లేని వాహనం పోలిసుల సహాయంతో తొలగించవలసిందిగా టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు. రోడ్డుని ఆక్రమించి నిర్మించిన ర్యాంపును తొలగించవలసిందిగా అలాగే భవన నిర్మాణం జరిగినప్పుడు సిబ్బంది పర్యవేక్షణ సరిగా జరగడం లేదని టౌన్ ప్లానింగ్ సిబ్బంది మీద ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది అందరూ వారికి కేటాయించిన విధులలో క్రమశిక్షణ పాటిస్తూ ఫీల్డ్ సిబ్బంది అందరూ వారి వారి సచివాలయ పరిధిలో క్షుణ్ణంగా తిరిగి, వారు చేయవలసిన విధులను క్రమశిక్షణ, నిబద్ధతతో నిర్వహించాలని సచివాలయ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకు కాలనీలోని పార్కు లోపల నిరుపయోగంగా ఉన్న భవనమును ఉపయోగములోకి తీసుకుని వచ్చి అద్దె భవనంలో వున్న సచివాలయమును నిరుపయోగంగా ఉన్న భవనంలోకి వెంటనే మార్పు చేయవలసినదిగా సూచించారు. అలాగే ఆ భవనానికి కావలసిన ఎలక్ట్రికల్, ఫర్నిచర్,సదుపాయములు వెంటనే ఏర్పాటు చేయవలసినదిగా ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.చెత్త వాహనములు రోజుకు ఐదు ట్రిప్పులు తిరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఖాళీ స్థలములకు పన్నులు విధించి వారిచేతే ఖాళీ స్థలములు శుభ్రముగా ఉంచుకొనునటట్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్యాంకు కాలనీ వద్ద వాటర్ ట్యాంక్ ను పరిశీలించి నీటి సరఫరా, నీటి నాణ్యత గురించి వివరములు అడిగి తెలుసుకున్నారు. అనగుంట వద్ద కాలువ పగలగొట్టి ప్లాట్లకు దారిని ఏర్పాటు చేసుకున్న సంబంధిత యజమాని చేత తిరిగి నిర్మాణం చేయించాలని, లేనిపక్షంలో వారిపై చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మేజరు డ్రైన్ పై శిథిలావస్థలో ఉన్న కల్వర్టు తిరిగి నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయవలసిందిగా ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనగుంట వద్ద నిర్మాణంలో ఉన్న భవనముకు ప్లాన్ మంజూరు చేశారా లేదా, లేని పక్షంలో సీవో, పి.ఓ. మరియు ఛార్జ్ షీట్లు ఇచ్చారా లేదా అని టౌన్ ప్లానింగ్ సిబ్బందిని వివరణ కోరారు. అనంతరం స్థానిక రామ్మూర్తి నగర్ అన్న క్యాంటీన్ ను కమిషనర్ సందర్శించారు. క్యాంటీన్లో ప్రజలకు అందిస్తున్న ఆహార నాణ్యతను తనిఖీ చేసి కమిషనర్ ప్రత్యక్షంగా అల్పాహారం తిని చూశారు. టోకెన్ విధానం ద్వారానే ప్రజలకు ఆహారాన్ని అందించాలని సూచించారు. క్యాంటీన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ శ్రీనివాసులరెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ రామ్మోహన్ రావు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషగిరిరావు, వెటర్నరీ డాక్టర్ మదన్ మోహన్, అడిషనల్ డేట్ డైరెక్టర్ హార్టికల్చర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ప్రసాదు, ముజాహిద్దీన్, రెవిన్యూ ఆఫీసర్ ఇనాయతుల్లా, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వేణు, సర్వేయర్ కామేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మా సహనాన్ని పరిక్షించ వద్దు : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

బుచ్చి ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : కొంతమంది మా మంచి తనాన్ని చేతకాని తనంగా తీసుకుంటారని ,మాసహనాన్ని పరిక్షించ వద్దని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి హెచ్చరించారు.బుచ్చిరెడ్డిపాళెంలోని ముంబాయి రహదారిలో డివైడర్ పైన తేజు దవలపర్స్ నేతృత్వంలో చెట్లు నాటిన సందర్భంగా జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతు నియోజకవర్గంలో ఎక్కడ అవినీతి జరగడం లేదని అన్నారు. నా మాటను గౌరవించి మా నాయకులందరు అవినీతి లేకుండా ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలో ఎక్కడ లేవుట్ వేసినా వారు చుట్టుపక్కల గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఆమె సూచించారు. అందులో భాగంగానే బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీలో తేజు దవలప్పర్స్ పెద్దఎత్తున మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధి సంక్షేమం రెండు సమపాళ్ళుగ చేసుకుంటు ముందుకు వెళుతున్నారని ఆమె కొనియాడారు. ప్రతిపక్షనాయకులు విమర్శలు చేసేటప్పుడు గతంలో మీరు ఏమి చేశారో ఇప్పుడు ఏం జరుగుతుందో తెలుసుకొని మాట్లాడాలని ఆమె హితవు పలికారు. ఈకార్యక్రమంలో బాగంగా హిజ్రాల్ అధ్యక్షురాలు ఆర్.అలేఖ్య, ఎస్ సులోచన, డి.శిల్ప, టి.నాని,రాధా ఎమ్మెల్యేకి ప్రత్యేకంగా దిష్టిలు తీసి ఆమెను ఆహ్వానించారు. శ్రీ వివేకానంద స్కూల్ విద్యార్థులు ఎమ్మెల్యేకి స్వాగతం పలికారు. రెయిన్‌బో స్కూల్ విద్యార్థిని బి.రక్షిత (8 వతరగతి) చేసిన భరతనాట్యం చూసి అబ్బురపడ్డ ఎమ్మెల్యే రక్షితాకి శాలువ కప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలో నగర చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, తేజా దెవలపర్స్ అధినేత శ్రీనివాసులురెడ్డి , వైస్ చైర్‌మెన్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పఠాన్ నస్రీన్, నాయకులు కమలాకర్‌రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు ఎం.వి.శేషయ్య, తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు, ఎంపిడిఓ శ్రీహరి, కమీషనర్ బాలకృష్ణ, ఎంపిపి మన్నెపల్లి శ్రీనివాసులు, నీటి సంఘం అధ్యక్షులు బత్తల హరికృష్ణ, వింజం రామానాయుడు,చేనేత సంస్థ డైరక్టర్ తాళ్ళ నరసింహస్వామి, వల్లూరు శ్రీనివాసులు, మైనార్టీనాయకులు పఠాన్ మహబూభాషా, కౌన్సిలర్ అందె ప్రత్యూషా, కౌన్సిలర్ తాళ్ళ వైష్ణవి, కౌన్సిలర్ బెళ్ళం మల్లారెడ్డి, కౌన్సిలర్ శ్రీదేవి, కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ,కౌన్సిలర్ చీర్ల ప్రసాద్‌యాదవ్, మోర్ల మురళీ, రేబాల నాయకులు శ్రీనివాసులురెడ్డి, పెనుబల్లి శ్రీకాంతిరెడ్డి, కౌన్సిలర్ కోటంరెడ్డి లలితారెడ్డి, టిడిపినాయకులు,కార్యకర్తలు ,అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం తనిఖీ

సైదాపురం, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త : మండల పరిధిలోని గోకులబృందావనం గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్, మండల విద్యాశాఖాధికారిణి–2 సుప్రియ గురువారం పరిశీలించారు. పాఠశాల లోని రికార్డులు, పరిసరాల పరిశుభ్ర తను పరిశీ లించారు. అనంతరం శ్రీమతి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి ఆహారాన్ని రుచి చూశారు. అనంతరం ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ అనంతమడుగు గ్రామంలోని సచివాలయాన్ని సందర్శించి వివిధ సర్వేల తీరును పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి చంద్రమోహన్, మహిళా సంరక్షణ కార్యదర్శి మిన్వాజ్, తదితరులు ఉన్నారు.

బాడిగింటకోసం వచ్చి మహిళ కళ్ళల్లో కారం కొట్టిన కి లేడిలు

కోవూరు ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : బాడుగిల్లు కావాలంటే ఇద్దరు కీ లేడిలు స్కూటిపై వచ్చి పాటూరు తదితర ప్రాంతాలలో గురువారం సాయింత్రం గంటపాటు తచ్చాడుతు ఓమహిళ కళ్ళల్లో కారం కొట్టి మెడలో బంగారు చైన్ లాకెళ్లిన సంఘటన పాటూరు రోడ్డు ప్రాంతంలో గురువారం సాయింత్రం సంచలనం కలిగించింది. నెల్లూరుకి చెందిన గూడపాటి వాసవి,దార్ల జీవనదీప్తిలు గురువారం సాయింత్రం స్కూటీపై బుర్కా వేసేకొని కోవూరులోని పాటూరు రోడ్డు ప్రాంతానికి వచ్చారు.ఈ సందర్భంగా వారు పలు ప్రాంతాలలో బాడుగకు ఇల్లు కావాలంటు పాలు ప్రాంతాలలో వాకబు చేశారు.తీరా ఓ ప్రతిపక్ష పార్టీకి చెందిన ఓనేత మాతృమూర్తి బాబుతో ఆడుకుంటు ఇంటి బయట ఉండగా వీరిరువురు మాటాలు మాట్లాడి ఆమె కళ్ళలో కారం కొట్టి మెడలో చైన్ లాక్కోని పరారి అయ్యారు. చుట్టుపక్కల ప్రాంతాల వారు వారి కోసం ఆరా తీయగా స్కూటిపై వెళుతుంటే వాసవి అనే అమ్మాయిని స్థానికులు స్కూటీతో సహా పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఆమరో అమ్మాయి పరారిలో ఉంది.ఈ మేరకు పోలీసులు పారిపోయిన మరో అమ్మాయి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు.

శ్రీవిశ్వనాదస్వామిని దర్శించుకున్న సోమిరెడ్డి

మనుబోలు ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : మనుబోలు మండలంలోని చెర్లోపల్లి రైల్వేగేట్ సమీపాన ఉన్న శ్రీ విశ్వనాథ స్వామిని బుధవారం రాత్రి సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దీపాల కాంతుల నడుమ మేళతాళాలతో ఆలయ అర్చకులు గందర్ల శ్రీనివాసులు సోమిరెడ్డికి ఘన స్వాగతం పలికారు. శ్రీవిశ్వనాథస్వామిని దర్శించుకొని శివపార్వతుల కళ్యాణ మహోత్సవానికి పట్టు వస్త్రాలు సమర్పించారు. విద్యుత్ దీపాలంకరణతో ఆలయ పరిసర ప్రాంతాలు మెరుమెట్లు గొలిపాయి రంగురంగుల పూలతో మరియు 1000 కిలోల ద్రాక్షతో శివపార్వతుల కళ్యాణ వేదికను సిద్ధం చేశారు చిన్నారుల భరత నాట్యాలు మహిళల కోలటాలు, ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేలాది భక్తుల నడమ అంగరంగ వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కళ్యాణాన్ని సాంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం మండల పార్టీ మండల అధ్యక్షులు గాలి రామకృష్ణారెడ్డి, ముంగర విజయబాస్కర్‌రెడ్డి ,సాని వెంకటరమణయ్య, శివుడు రాజాగౌడ్ , చుట్టుపక్కల గ్రామాల నుండి అనేక మంది ప్రజలు పాల్గొన్నారు.

హనుమంత సేవలో కోదండరామస్వామిగా శ్రీదేవి భూదేవి సమేతుడైన కళ్యాణ వెంకటేశ్వరస్వామి

బుచ్చి ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : బుచ్చిరెడ్డిపాళ